

రాయచోటి అసెంబ్లీ స్థానం నుండి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొంది శుక్రవారం రోజు అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, క్రీడా యువజన శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిగారు


వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 22 జూన్ 2024


నీట్ పరీక్షలో ర్యాంక్ రాలేదని

## విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**చిట్వేలి, జూన్ 21, ప్రభాతవార్త:**



నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రన్స్ టెస్ట్) ఫలితాలలో ర్యాంక్ రాలేదని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన శుక్రవారం రాత్రి 8 గంటలకు చిట్వేలిలో చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మల్లెంపల్లికి చెందిన లక్ష్మీనారాయణ కుమార్తె సృజన నీట్ ఫలితాలలో ర్యాంకు రాలేదని గుంజన నది వంతెన నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. విషయం తెలుసుకొని సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకున్నామన్నారు. బాధితురాలు సృజనను బయటకు తీసి చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించామన్నారు. కాగా సంఘటనకు దారి తీసిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# డబ్బు కొట్టు... వికలాంగ సర్టిఫికెట్ పట్టు..!

- జమ్మలమడుగు ప్రాంతంలో భారీగా వసూళ్లు
- పెద్దముడియం మండల వాసే దళారీ అవతారం
- ఒకే ఇంటిలో ఇద్దరు, ముగ్గురికి వికలాంగ పింఛన్లు




డబ్బులు కడితే చాలు.. ఎలాంటి రోగం లేకుండా మంచి పర్సంటేజీతో వికలాంగ సర్టిఫికెట్ ఇంటి వద్దకు వస్తోంది. తద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే వికలాంగ పింఛన్లను అప్పనంగా కొట్టేయవచ్చు. ఎలాగూ వాలంటీర్లు ఇంటి వద్దకు పింఛను తెచ్చి ఇవ్వడంతో తాము వికలాంగ పింఛను పొందుతున్నట్లు అటు వాలంటీర్‌కు, ఇటు లబ్ధిదారునికి తప్ప మూడో వ్యక్తికి తెలియదు. దీంతో ఇన్నాళ్లు గుట్టుచప్పుడు కాకుండా జరిగిన ఈ వ్యవహారం నూతన ప్రభుత్వం ఏర్పడడంతో ఒక్కొక్కటిగా అక్రమాలు వెలుగు చూస్తున్నాయి.

**జమ్మలమడుగు, జూన్ 21, ప్రభాతవార్త:**

పెద్దముడియం మండలంలో ఓ దళారీ పాత్ర.. వినికిడి లోపం లేకున్నా వినికిడి లోపం భారీగా ఉన్నట్లు మంచి పర్సంటేజీతో వికలాంగ సర్టిఫికెట్ తాను ఇప్పించగలుగుతానని నమ్మబలికి పెద్దముడియం మండలానికి చెందిన ఓ దళారీ లక్షల రూపాయలు వసూలు చేశాడు. ఇతను ఒక్కొక్కరి నుంచి రూ.40వేలు వరకు వసూలు చేసి కడప రిమ్స్ వైద్యుల ద్వారా వికలాంగ సర్టిఫికెట్లు ఇప్పించగలిగాడు. అతని చేతుల మీదుగానే కొన్ని వందల నకిలీ సర్టిఫికెట్లు మంజూరైనట్లు తెలుస్తోంది. తాను వసూలు చేసిన డబ్బులో భారీ మొత్తాన్ని వైద్యులకు అందజేయడమే కాకుండా ఇటీవల ఆ వైద్య బృందాన్ని ఉచితంగా గోవాకు తీసుకెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. ఇంత జరుగుతున్నా వైద్య ఆరోగ్యశాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విచారకరం.

**జిల్లాలో 40వేలకు పైగా వికలాంగ పింఛన్లు..**

జిల్లా వ్యాప్తంగా మే నెలలో 40,160 మంది వికలాంగ పింఛన్లు తీసుకున్నట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. వీటిలో అధిక భాగం వినికిడి లోపం ఉన్న వారే. వాస్తవానికి వినికిడి లోపం ఉన్నట్లు పింఛను తీసుకుంటున్న వారిలో చెవుడు ఉన్నట్లు వైద్యులు కళ్లు మూసుకొని ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారు. వీటన్నిటిపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఒక్క పెద్దముడియం మండలంలోనే.. పెద్దముడియం మండలంలోని ఒక్కో పల్లెలో వంద నుంచి 200 వరకు నకిలీ వికలాంగ సర్టిఫికెట్లు దర్శనమిస్తున్నాయి. ఒక్కొక్క ఇంటిలో ఇద్దరు, ముగ్గురికి కూడా వికలాంగత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఒక్కొక్క ఇంటిలో ఇద్దరు, ముగ్గురికి కూడా వికలాంగత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పెద్దముడియం మండలంలోనే 5211 మంది పింఛన్లు తీసుకుంటున్నారు. వీటిలో సగం వికలాంగ పింఛన్లే. నెమళ్లదిన్నె, బలపనూరు, జంగాలపల్లె, కొట్టాలపల్లె క్లస్టర్లలో ఈ సంఖ్య ఎక్కువగా ఉంది.

**నూతన ప్రభుత్వానికి రెట్టింపు ఆర్థిక భారం**

ఒక్క కడప జిల్లాలోనే వికలాంగ పింఛన్ల కింద ఈ ఏడాది మే నెలలో రూ.12.04 కోట్లు పంపిణీ చేశారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం పింఛను మొత్తాన్ని రెట్టింపు చేయడంతో ప్రభుత్వం మీద రెట్టింపు ఆర్థిక భారం పడనుంది. వీలైనంత త్వరలో ఉన్నతాధికారులు వికలాంగ పింఛన్ల సర్టిఫికెట్లపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బోగస్ లబ్ధిదారులను తొలగించాలి. అంతేకాకుండా వీరికి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసిన వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. లక్షల రూపాయలు సంపాదించిన దళారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా ప్రజలందరూ

## యోగాను దినచర్యగా చేసుకోవాలి



**రాయచోటి, జూన్ 21, ప్రభాతవార్త:**

జిల్లా ప్రజలందరూ యోగాను తమ దినచర్యగా చేసుకోవాలని అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ ప్రజలకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం స్థానిక రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. యోగా శిక్షకుడు పర్యవేక్షణలో యోగా దినోత్సవానికి హాజరైన విద్యార్థులతో కలిసి కలెక్టర్ వివిధ రకాల ఆసనాలను వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా గుర్తించిందని 2015 నుంచి ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. మన కోసం మరియు సమాజం కోసం యోగా అనే థీమ్‌తో యోగా వల్ల వ్యక్తిగత మరియు సామాజిక ఆరోగ్య భద్రత పట్ల అవగాహన కల్పించేలా జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సాయి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


యోగాతో మానసిక ఆరోగ్యం 4లో


## సంక్షేమ శాఖలు సమర్థవంతంగా పని చేయాలి



**రాయచోటి, జూన్ 21, ప్రభాతవార్త:**

జిల్లాలోని సంక్షేమ శాఖలు సమర్థవంతంగా పని చేయాలి. ఆయా సంక్షేమ శాఖల ద్వారా ప్రజల అవసరాలను గుర్తించగలిగి సమర్థవంతంగా అడుగులు వేస్తే సంక్షేమం సార్థకమవుతుందని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ సంక్షేమశాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వికలాంగ, మహిళా శిశు సంక్షేమం మరియు సంక్షేమ శాఖల కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగ సంక్షేమ శాఖలలో ఏమేమి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు, అందులో భౌతిక, ఆర్థిక లక్ష్యం, సాధించిన ప్రగతి, జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు ఎన్ని, వాటిలో గల విద్యార్థుల సంఖ్య తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల ఇన్‌ఛార్జి అధికారి వెంకట సుబ్బయ్య, బీసీ, మైనార్టీ సంక్షేమ అధికారుల సందప్ప, మస్తాన్, ఐసీడీఎస్ అధికారిని శశికళ, సీపీవో కృష్ణా నాయక్, ఇండస్ట్రీస్ జీఎం సూరిబాబు, ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మోహిని అవతారంలో అలరించిన వేంకటేశ్వర స్వామి

**చిట్వేలి, జూన్ 21, ప్రభాతవార్త:**

చిట్వేలి మండల పరిధిలోని కేఎస్ అగ్రహారంలో వెలసిన శ్రీ భూనీలా సమేత వెంకటేశ్వర సస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీ వెంకటేశ్వర స్వామి వారు మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక గ్రామంతో పాటు చిట్వేలి ప్రధాన వీధుల్లో మంగళవాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు దారి పొడవునా స్వామి వారికి కొబ్బరి కాయలు, నైవేద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు దారి పొడవునా స్వామి వారికి అర్చకులతో దీవెనలు అందుకున్నారు. జూన్ 16 నుంచి ప్రారంభమైన ఈ బ్రహ్మోత్సవాలు 26 వరకు జరగనున్నాయి. రోజూ స్వామి వారు ఓ ప్రత్యేక అలంకరణలో భకక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. శుక్రవారం రాత్రి గరుడు సేవ, శనివారం సాయంత్రం స్వామి వారి కల్యాణం, ఆదివారం రథోత్సవం, మంగళవారం నిర్వహించే పారువేట, తోట ఉత్సవం ఇక్కడ ప్రత్యేకంగా నిలుస్తుంది. మాజీ సర్పంచ్ మన్నూరు సుధీర్‌రెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం ఉభయ దాతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చిట్లూరు శేఖర్ కుటుంబీకులతో పాటు పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.



# ఆదర్శ పాఠశాలలో యోగ దినోత్సవం





**చిన్నమండెం, జూన్ 21, ప్రభాత వార్త :**

మండలంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో అంతర్జాతీయ యోగ దినోత్సవ సందర్భంగా జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు యోగ గురువు సానా శివప్రసాసద్ యోగాసనాలు నేర్పించారు. ఈ కార్యక్రమానికి మండల ఎంపిడిఒ విచ్చేసి మాట్లాడుతూ యోగను జవితంలో ఒక భాగంగా చేసుకోవాలన్నారు. యోగ వల్ల మనసు, శరీరం దృఢత్వం కలిగి ఉండడంతో పాటు మానసిక చైతన్యం పెరిగి చదువుపై ఆసక్తి పెరిగి జీవిత లక్ష్యాలను చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వి. రమేష్, ప్రోగ్రామ్ అధికారులు కెఎ. నాగనవీన్, ఎం. సుబ్బరాయుడు, పిడి రామాంజినేయులు తదితరరులు పాల్గొన్నారు.

## సుందరయ్య కాలనీలో మంచినీటి సౌకర్యం కల్పించాలి



**బద్వేలు అర్బన్ , జూన్ 21, ప్రభాతవార్త :**

మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీలో మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ అలాగే కమిషనర్ ప్రజలకు ఇచ్చిని హామీని నిలబెట్టుకోవాలని లేకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీపీఎం పట్టణ నాయకుడు చిన్ని పేర్కొన్నారు. శుక్రవారం సీపీఎం కమిటి ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతిపత్రం అదించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా మంచినీటి సౌకర్యం లేక పొలలోకి వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారని ఈ విషయమై పలుమార్లు ఆర్డీవో, కమిషనర్‌లకు తెలియజేసినప్పటికీ వారు ఆ సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. అలాగే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బోరు వేసినా మోటారు కనెక్షన్ ఇవ్వకపోవడంతో అక్కడి వారు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చొరవచూపి పైపులైన్ ఏర్పాటు చేసి అక్కడి వంద కుటుబాలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటి సభ్యులు మోక్షమ్మ, అనంతమ్మ, పట్టణ నాయకులు ఆంజనేయులు, గోవర్ధన్, నారాయణ, రాయప్ప, ఓబయ్య, మస్తాన్‌బి తదితరులు పాల్గొన్నారు.

## యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవితం

**కడప వైద్యవిభాగం, జూన్ 21, ప్రభాతవార్త:**



యోగాతో లభించే శారీరక, మానసిక ఆధ్యాత్మిక ఆరోగ్య ప్రయోజనాలను ప్రోత్సహించడానికి జూన్ 21న అంతర్జాతతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ నిర్వహించిన యోగాభ్యాస ప్రదర్శనకకు ముఖ్య అతిథిగా డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం విద్యార్థులతో పాటు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమానికి సీడప్ డిస్ట్రిక్ మేనేజర్ వేణుమాధవ్, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం..

**కడప కార్పొరేషన్, జూన్ 21, ప్రభాతవార్త:**

నిత్యం యోగాసనాలు చేయడం ద్వారానే మానవునికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని విశ్రాంత ఉద్యోగి, ప్రముఖ యోగా గురువు చింతామని చలపతి అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కడప మారుతీనగర్‌లో శివ బాబాయోగ ఆరోగ్య మందిరంలో ప్రాణాయమం యోగా ఆసనాలు చేశారు. అనంతరం చలపతి సన్మానించారు. ఈ సందర్భంగా యోగ గురువు చలపతి మాట్లాడుతూ నిరంతర యోగాసనాలతో మానవుని శరీరం అవయవాలు మేథస్సు సక్రమంగా పని చేస్తాయని, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. యోగాసనాల వలన రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుందని కూడా చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో నాగమునిరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపల్ మస్తాన్, విశ్రాంత ఎంఆర్‌వో రంగనాయకులు, రేవి, ఉదయ్ కాంత్, ప్రదీప్, సుదర్శన్‌రెడ్డి, రాజు, వంశీధర్, రామకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

## మానసిక శారీరక ఆరోగ్యానికి యోగాసనాలు దోహదపడతాయి

**రామాపురం, జూన్ 21, ప్రభాతవార్త:**

యోగాసానాలు వేయడం వల్ల మానసికంగా శారీరకంగా ఆరోగ్యానికి పరిపుష్టతకు దోహదపడతాయని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శ్యామలాదేవి అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచే యోగాసనాలు నేర్చుకోవడం వల్ల మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండడానికే యోగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చిట్వేలిలో ఘనంగా అంతర్జాతీయ యోగా వేడుకలు

**చిట్వేలి, జూన్ 21, ప్రభాతవార్త:**

పదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని చిట్వేలి మండల పరిధిలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీసాయి వికాస్ పాఠశాల కరస్పాండెంట్ తిరుమల రెడ్డయ్య ఆధ్వర్యంలో, శ్రీపద్మావతి పాఠశాలలో కరస్పాండెంట్ ఎం.లతా లావణ్య ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పి.పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో, ఐసీడీఎస్ అధికారిని రాజేశ్వరి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ యోగా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ యోగా జీవితంలో ఒక భాగం కావాలన్నారు. ఉచ్వాస, నిచ్వాసలతో శరీరాన్ని ఉత్తేజం చేయగల ఏకైక సాధనం యోగా అన్నారు. ప్రతి ఒక్కరి నిజ జీవితంలో యోగా అత్యంత ఆవశ్యకమని శ్రీసాయి వికాస్ యోగా సాధనలో పాల్గొన్న యోగా గురువు వెంకట శివయ్య అన్నారు.

## కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా సహాయ మంత్రిని కలిసిన ఓబుళాపురం రాజశేఖర్

**బద్వేలు అర్బన్ , జూన్ 21 ప్రభాతవార్త :**



కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారి ఆంధ్రప్రదేశ్‌కు విచ్చేసిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను బద్వేలు టీడీపీ నాయకులు ఓబుళాపురం రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనతో పలు విషయాలను చర్చించారు. జీవితంలో ఒక్కోమెట్టు ఎక్కుతూ దేనికి తలవంచక నిజాయతీగా తెలుగుజాతి సగర్వంగా తల ఎత్తుకునేలా చేసిన వ్యక్తి పెమ్మసాని అని ఆయన రాజకీయ రంగ ప్రవేశం ద్వారా పలువురు యువత, సామాన్యులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఇలాంటి గొప్ప వ్యక్తులను రాజకీయ సమాజానికి పరిచయం గలిగిన ఒక్కపార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. పెమ్మసాని మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రాజశేఖర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## కోర్టు ఆవరణలో ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు

**కడప లీగల్, జూన్ 21, ప్రభాతవార్త:**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫకృద్దీన్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం 2024 థీమ్ స్వీయ మరియు సమాజం కోసం యోగా జూన్ 21న ప్రతి ఏటా అంతర్జాతీ యోగా దినోత్సవం జరుపుకుంటున్నామని యోగా ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ అహ్మద్, ప్రవీణ్‌కుమార్, ప్రత్యూషకుమారి, నందిని, భార్గవి, విజయలక్ష్మి, హేమ శ్రవంతి, గుప్ప్ప, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు సేవించి వ్యక్తి మృతి

**దువ్వూరు, జూన్ 21, ప్రభాతవార్త:**

నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం ములుమాలపేట గ్రామానికి చెందిన వెన్నపూస సుబ్బారెడ్డి(37) శుక్రవారం పురుగులమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి చాగలమర్రి మండలానికి చెందిన సుబ్బారెడ్డి దువ్వూరు మండల పరిధిలోని ఇడమడక గ్రామ సమీపాల్లో శుక్రవారం వివిధ బాధలతో పురుగుల మందు సేవించాడన్నారు. భార్య పుట్టింటికి వెల్లడం, మద్యానికి బానిస కావడం కుటుంబకలహాలతో పురుగుల మందు సేవించాడని తెలిపారు. ఇడమడక గ్రామ సమీపాన మృతిచెంది ఉండగా గ్రామస్థులు ఈ వివయాన్ని తెలియజేయడంతో బంధువుల ద్వారా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పడమటికోన సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్ఈ



**చిన్నమండెం, జూన్ 21, ప్రభాత వార్త :**
ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా విద్యుత్ శాఖ అధికారి సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్ రమణ శుక్రవారం చిన్నమండెం మండలంలోని 33/11కెవి పడమటికోన సబ్ స్టేషన్‌లను తనిఖీ చేశారు. బోరెడ్డిగారిపల్లె, పడమటికోన తదితర ప్రాంతాలలో టాన్స్‌ఫార్మర్‌లను, లైన్లను క్షేత్ర స్థాయిలో స్వయంగా తిరిగి పరిశీలించి అధికారులకు ఆదేశించారు. అంతరాయాలు అధికంగా ఉన్నాయి, లైన్‌లలో తిరిగి సమస్యలను గుర్తించి ముందస్తు మరమ్మతులు చేసి అంతరాయాలను అరికట్టి నిరంతర విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించారు. రైతులను వ్యయప్రయాసాలకు గురికాకుండా కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్పుటకు అవసరమైన మరమ్మతులుల పూర్తి చేసి ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులో ఉంచుకొని సంస్థ వాహనాల ద్వారా వీటిని వినియోగదారుని వద్దకు చేర్చి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని ఆదేశించారు. కేటాయించిన ప్రాంతాలలో నివాసాలు ఉంటూ వినియోగదారులకు చేరువులో ఉంటూ వినియోగదారుల విద్యుత్ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించి సంస్థపై ప్రజలలో సంతృప్తికరస్థాయిని పెంచే విధంగా పని చేయాలని ఆదేశించారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్‌లను ఎప్పటికప్పుడు సరి చేయాలని ఆదేశించారు. రైతుల విద్యుత్ సమస్యలైన ట్రాన్స్‌ఫార్మర్ పీజులు వేయడం, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌లు మార్చడం వంటి తదితర పనులుపై వెంటనే స్పందించండి, వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉంచుటలో భాగంగా విద్యుత్ స్తంభాలను తాకకుండా తెగిపడిన విద్యుత్ వైర్లను తాకకుండా మరమ్మతులు చేయించుకునే విధంగా ప్రజలలో అవగాహన కల్పించుట, వార్తా పత్రికల ద్వారా, టోకల్ టీవీల ద్వారా ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పించి విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలనని తెలియజేశారు. వినియోగదారుడు తమ విద్యుత్ సమస్యలపై వచ్చినప్పుడు క్షేత్ర స్థాయిలోని సిబ్బంది, అధికారులు వారితో మమేకమై మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి విద్యుత్ సమస్యలను సావధానంగా విని పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డిఇఇ విజయకుమార్‌రెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రాజేష్ తదిరులు పాల్గొన్నారు.

## కమిషనర్‌కు సమ్మె నోటీసు

**బద్వేలు అర్బన్ , జూన్ 21, ప్రభాతవార్త :**
మున్సిపాలిటీలోని కార్మికుల సమస్యలు ఆగస్టు 1వ తేదిలోగా పరిష్కరించాలని లేకపోతే నిరవధిక సమ్మెలోకి వెళతామని తెలియజేస్తూ సమ్మెనోటీసుకు కమిషనర్‌కు మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు శుక్రవారం అందజేశారు. పట్టణ కోశాధికారి శివకుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య విభాగ కార్మికులకు బకాయి ఉన్న 2024వ సంవత్సరం జనవరి, ఫిబ్రవరి నెలలో భృతి, ఆరోగ్యభత్యం మంజూరు చేయాలని పేర్కొన్నారు. అధనపు



పారిశుద్ధ్య కార్మికులకు రావలసిన మూడు నెలల బకాయి వేతనాలను మంజూరు చేయాలని పారిశుద్ధ్య విభాగంలో చెత్త తరలించే వాహనాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని, వాహనాల మరమ్మతులలో జరుగుతున్న అవినీతి , అక్రమాలను నివారించాలని,ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెరుగుతున్న పట్టణ జనాభా రీత్యా పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులపైన పని భారం తగ్గించాలని పారిశుద్ధ్య కార్మికులపై సచివాలయ పారిశుద్ధ్య కార్యదర్శులు, అధికారులు వేధింపులు అరికట్టాలని లేకపోతే రానున్న కాలంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, ఆ లోపు సమస్యలు పరిష్కరించకపోతే ఆగస్టు 1వ తేదిన సమ్మెబాట పడతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు కె.నాగేంద్రబాబు, శ్యామ్, ప్రవీన్, హరి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## విధ్యార్థి దశలో యోగా చేయడం చాలా అవసరం



**ముద్దనూరు, జూన్ 21, ప్రభాతవార్త:**
అంతర్జాతీయ యోగా దినోత్సవం సంధర్భంగా ముద్దనూరు బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నాడు విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు యోగాలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజబాబు మాట్లాడుతూ మానసికంగా మనిషి అభివృద్ధి చెందాలంటే ముఖ్యంగా ప్రతిరోజు యోగా చేయడం చాలా అవసరమని అన్నారు. విద్యార్థి దశలో ప్రతిరోజు అరగంట సేపు యోగా చేయడం చాలా అవసరం అని ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యోగ చేసిన విద్యార్థులకు బహుమతులు పాఠశాలలోని ఉపాధ్యాయుడు కుండా భాస్కర్ అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు పిడి మాధవరెడ్డి, యోగామాస్టర్ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఓంకార ఉచ్చరణ చేసి మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పొందండి

**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 21, ప్రభాతవార్త:**
పదవ అంతర్జాతీయ యోగ దినోత్సవంలో భాగంగా జమ్మూకాశ్మీర్‌లోని అనంతనాగ్‌లో ఓం మండలి శివశక్తి అవతార్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో వేలాది మందితో దేశభక్తి ర్యాలీ నిర్వహించి తర్వాత మార్తాండ సూర్య దేవాలయంలో జరిగిన సామూహిక ఓంకార ఉచ్చరణ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సంస్థ అధ్యక్షురాలు దేవకీ మాతాక్ష పాల్గొని ఆరోగ్య భారత్‌నిర్మాణానికి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. జమ్మూ కాశీనమర్‌లో జరిగిన యోగా ఉత్సవం స్పూర్తితో ప్రతి రోజు ప్రజలు ఓంకార ఉఛ్ఛారణ చేసి మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పొందాలని కోరుకుంటున్నట్లు ధ్యాన కేంద్రం అధ్యక్షుడు బి.సుబ్బరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు.



## యోగాతో ఆరోగ్యానికి మేలు

**దువ్వూరు, జూన్ 21, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన దువ్వూరులోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రం నందు యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ పి.వికసిత మాట్లాడుతూ "శరీర మాధ్యం ఖలు ధర్మసాధనం" జీవితంలో ఏది సాధించాలన్నా శారీరక ఆరోగ్యం అనేది చాలా ముఖ్యం అన్నారు. ఆరోగ్యాన్ని సంపూర్ణంగా అందించేది యోగానే అన్నారు. ప్రతి ఒక్కరు యోగా చేసి ఆరోగ్యంగా జీవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు ప్రాధమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.




## అటవిశాఖ బీట్ల పునర్విభజనకు ప్రతిపాదనలు

**సిద్దవటం, జూన్ 21, ప్రభాతవార్త:**
దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న అటవి శాఖ బీట్ల పునర్విభజన కొరకు సిద్దవటం రేంజిలో ఉన్న 2 సెక్షన్లు, 7 బీట్లు ఉన్నాయని, బీట్ల విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో 6సెక్షన్లను, 23బీట్లను పునర్విభజన చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలను పంపామని సిద్దవటం రేంజర్ బి.కళావతి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని అటవీ శాఖ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో బీట్ల విస్తీర్ణం అధికంగా ఉండటం చేత సిబ్బందిపై పని ఒత్తిడిని తగ్గించేందుకు, అడవులను సంవర్ధంగా కాపాడటానికి, అదనంగా సామాజిక వనరులను అభివృద్ధి చేస్తూ ఉన్న అటవీ ప్రాంతంను భూ అక్రమణలు జరగకుండా నివారించడమే కాకుండా రాబోవు తరాల వారికి ఒక మంచి స్వచ్ఛమైన పర్యాటకాన్ని అందించడమే ధ్యేయంగా కసరత్తు జరుగనుందన్నారు. బీట్ల పునర్విభజన జరిగితే ఎర్రచందనం, వన్యప్రాణులను కాపాడటం సులభతరమౌతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం బీటు అధికారి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కుందూ నీరు చెరువులకు తరలింపు

**దువ్వూరు, జూన్ 21, ప్రభాతవార్త:**
నంద్యాల జిల్లాలో కురిసిన వర్షాల వల్ల కుందూనదికి వస్తున్న వర్షపు నీటిని కేసీ కాలువల ద్వారా చెరువులకు కేసీ అధికారులు మళ్లిస్తున్నారు. కుందూనదిలో రాజోలి వద్ద 1350క్యూసెక్కుల నీరు ప్రవహిస్తూ ఉండగా మైదుకూరు కాలువలకు 200క్యూసెక్కులు, అలాగే చాపాడు కాలువలకు 50క్యూసెక్కుల నీటిని మళ్లించారు. ఈ నీటిని ఖాజీపేట మండలంలోని పుల్లూరు, రావులపల్లె, దుంపలగట్టు చెరవులకు నీటిని మళ్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే చాపాడు కాలువ ద్వారా చెన్నమరాజుపల్లె, నాగాయపల్లె, మదూరు చెరువులకు నీరు వెల్తుందని అధికారులు తెలిపారు. అలాగే ఆదినిమ్మాయిపల్లె ఆనకట్ట నుండి కడపలోని పాత కడప చెరువుకు నీటిని మళ్లిస్తున్నారు. ఈ నీరు కేవలం చెరువులకు మాత్రమే వదులుతున్నామని పంట సాగు చేసుకునేందుకు వదలడం లేదని అధికారులు తెలిపారు. ఈ విశయాన్ని రైతులు గమనించాలని పేర్కొన్నారు.



## వైయస్సార్ జిల్లా పేరును వైయస్సార్ కడప జిల్లాగా మార్చాలి

**ప్రొద్దుటూరు, జూన్ 21, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం వెంటనే వైయస్సార్ జిల్లాగా ఉన్న పేరును వైయస్సార్ కడప జిల్లాగా మార్చాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ ఎన్.తులసీరెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ క్రీస్తు 1808లో కడప జిల్లా ఏర్పాటుఅయ్యిందన్నారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి నిలయమైన తిరుమలకు తొలి గడప దేవుని గడప అన్నారు. అందుకే జిల్లాకు కడప జిల్లా అని పేరు పెట్టబడిందని, క్రీస్తు 2010 వరకు కడప జిల్లా అని పేరు ఉండేదన్నారు. స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం ఆయన జ్ఞాపకార్థం జిల్లా పేరును వైయస్సార్ జిల్లాగా మార్చడం జరిగిందన్నారు. అటు రాజశేఖర్ రెడ్డి జ్ఞాపకార్థం ఇటు తిరుమల వెంకటేశ్వర స్వామి గుర్తుగా ఉభయతారకంగా వైఎస్సార్ కడప జిల్లా అని పేరు బాగుంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి తులసీరెడ్డి సూచించారు. మీడియా సమావేశంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూల నజీర్ ఆహ్మద్, కాంగ్రెస్ నాయకులు జిలానీ బాషా, షేక్ పూల మహమ్మద్ జావిద్, అమర్‌నాథ్ రెడ్డి, సుబ్బరాయుడు, మహబూబ్ బాషా, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలు




**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 21, ప్రభాతవార్త:**
స్థానిక రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్ నందు శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సహజ యోగా ధ్యానం వారి ఆధ్వర్యంలో గురుజీలు వెంకటరామిరెడ్డి, ఎన్.కృష్ణ, కేసి వెంకటరమణలు విద్యార్థిని, విద్యార్థులకు సహజ యోగా ధ్యానం చేయించి, వాటి ద్వారా వచ్చే ప్రయోజనాలను ముఖ్యంగా విద్యార్థులలో జ్ఞాపకశక్తి, చురుకుదనం ఆత్మవిశ్వాసం భావవ్యక్తీకరణ అభివృద్ధి ఎలా చెందుతాయో వీటి ద్వారా విశదీకరించి చెప్పారు. అలాగే ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ తరుణ్ ఇంద్ర శేఖర్, ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి, డైరెక్టర్ సుబ్బరాయుడు, ఇన్చార్జి ప్రిన్సిపల్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## రాజంపేటలో ఘనంగా యోగా వేడుకలు

**రాజంపేట అర్బన్, జూన్ 21, ప్రభాతవార్త:**
యోగా దినోత్సవ వేడుకలు రాజంపేటలో ఘణంగా నిర్వహించారు. రాజంపేట క్రీడా మైదానం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, బీజేపి కార్యాలయాల్లో యోగా దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఆరోగ్యమే మహా భాగ్యమని బిజెపి నాయకుడు పోతుగంట రమేష్ నాయుడు పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పురుషోత్తం, ఫిజికల్ డైరెక్టర్ మేజర్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో యోగా వేడుకలు జరిగాయి. అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో పెద్దఎత్తున యోగాసనాలు వేసి విద్యార్థులు ప్రదర్శణ నిర్వహించారు.



## ఘర్షణ కేసులో ఇద్దరు అరెస్ట్

**కడప క్రైం, జూన్ 21, ప్రభాతవార్త:**
కడప నగరంలోని వన్‌టౌన్ పీఎస్ పరిధిలో రాజీవ్ పార్క్ సమీపంలో ఈనెల 19వ తేదీ రాత్రి జరిగిన ఘర్షణ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నిందితులలో విష్ణువర్ధన్ అలియాస్ విష్ణు, నరసింహాచారి అలియాస్ నరసింహను శుక్రవారం రాజారెడ్డివీధిలో సీఎస్ఐ మైదానానికి వెళ్లే దారిలో సీఐ భాస్కర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మరొకరు మృతి

**కడప క్రైం, జూన్ 21, ప్రభాతవార్త:**
కడప నగర శివార్లలో గురుకుల పాఠశాల సమీపంలో ఆర్టీసీ బస్సు, కారును ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న రాజమోహన్(58) శుక్రవారం మృతి చెందారు. ఈ సంఘటనలో రామయ్య, రాజమోహన్ కుమారుడైన గురురోహిత్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన రాజమోహన్, అతని భార్య లక్ష్మీదేవిలలో ఒకరైన రాజమోహన్ మృతి చెందాడు. ఈ సంఘటనలో రాజమోహన్ మృతదేహానికి రిమ్స్ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్సై నారాయణ తెలిపారు.

## ఎమ్మెల్యేగా పుట్టా ప్రమాణస్వీకారం,

**మైదుకూరు జూన్ 21,ప్రభాతవార్త :**
మైదుకూరు శాసనసభ్యులుగా పుట్టా సుధాకర్ యాదవ్ శుక్రవారం అసెంబ్లీలో మొట్ట మొదటగా ప్రమాణస్వీకారం చేశారు. తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టి తన చిరకాల స్వప్నం నెరవేర్చుకున్న పుట్టా సుధాకర్ యాదవ్‌ను అభిమానులు, కార్యకర్తలు విజయవాడ తన కార్యాలయంలో కలుసుకొని శాలువాలుకప్పి పూలమాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.



## ఘనంగా యోగాడే వేడుకలు,



**మైదుకూరు జూన్ 21. ప్రభాతవార్త :**
అంతర్జాతీయ యోగాడే దినోత్సవాన్ని పురస్కరించుకొని మైదుకూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం విద్యార్థులు యోగాసనాలను ప్రదర్శించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.రమాదేవి, పాఠశాల యోగా శిక్షకుడు రమేష్ పాల్గొన్నారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ప్రశాంతతా,శారీరక స్వస్తత సిద్దిస్తుందని,ప్రపంచానికి యోగాను అందించిన ఘనత మన దేశానికి దక్కిందని పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్తమ పౌరులుగా రూపొందటానికి యోగా చక్కని సాధనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు వినోనియారాణి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు గోశెట్టి రామమోహన్, ఎల్.సూర్యానారాయణరెడ్డి, ఆవుల శ్రీనివాసులు, తవ్వా ఓబుళరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## కొవ్వూరు బాల చంద్రారెడ్డి మృతి బాధాకరం..

**కడప కార్పొరేషన్, జూన్ 21, ప్రభాతవార్త:**
బీజేపీ సీనియర్ నాయకులు కొవ్వూరు బాల చంద్రారెడ్డి మృతి బాధాకరమని బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి, నాయకులు కందుల మురళీమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రొద్దుటూరులో కొవ్వూరు బాల చంద్రారెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి, శ్రీరాములు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో మానసిక ప్రశాంతత

**కడప ఎడ్యుకేషన్, జూన్ 21, ప్రభాతవార్త :**
యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కడప స్వామి వివేకానంద కేంద్రం యువ యోగా గురువులు సి.ధరణికుమార్ పేర్కొన్నారు. కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలోని క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ప్రపంచ యోగా 10వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వారి దైనందిన జీవితకాలంలో యోగా సాధన చేయాలని, యోగా సాధన చేయడం వలన మానవునిలో అనేక రుగ్మతల నుండి విముక్తి పొందవచ్చని తెలిపారు. 2024 యోగా దినోత్సవం ముఖ్య నినాదం వైదవ్ కుటుంబం అంటే భూమి నా ఇళ్లు అని, యోగా అనేది భారతదేశ ప్రాచీన సాంప్రదాయానికి అమూల్యమైనదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టరు డాక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి (నాని), కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.నాగేశ్వరప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజరు పి.ప్రేమ్‌కుమార్, స్టాఫ్ మేనేజరు వి.సుబ్బరాయుడు, ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త జె.సురేష్‌బాబు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

**– పులివెందుల రూరల్ :** పులివెందులలోని ఆహారవిజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యోగా చేయడం వలన కలిగే ప్రయోజనాల గురించి గురూజీలు వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి, రాజశేఖర్‌లు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ యం.సర్దార్‌బేగ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**– వేంపల్లె :** పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వేంపల్లెలోని శ్రీచైతన్య హైస్కూల్‌లోని ఆధ్యాత్మిక సంస్థ వివేకానంద కేంద్రం కన్యాకుమారి వేంపల్లె శాఖ, పిరమిడ్ సొసైటీలు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ యోగా అనేది మన ప్రాచీన భారత సాంప్రదాయం ఇచ్చిన అమూల్యమైన బహుమతి అన్నారు. యోగా అనేది శారీరక, మానసిక శ్రేయస్సును పెంచడానికి అత్యంత విశ్వసనీయ సాధనంగా ఉద్భవించిందని పేర్కొన్నారు. భారత దేశానికి సంబంధించిన యోగాను ప్రపంచ వ్యాప్తంగా జరుపుకోవడం మనమంతా గర్వించదగ్గ విషయమని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ దైనందిన జీవితంలో యోగాని భాగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ డి.వి.సుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగిశెట్టి సునీల్, మహమ్మద్, జనసేన కార్యకర్తలు రామకృష్ణ, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## విత్తన దుకాణాలను తనిఖీ

**ముద్దనూరు, జూన్ 21, ప్రభాతవార్త:**
ముద్దనూరు మండలంలోని విత్తన దుకాణాలను తనిఖీ అధికారి మరియు కమళాపురం ఏడీఏ ఏవి.నరసింహారెడ్డి స్థానిక ఏవో మారెడ్డి. వెంకటకృష్ణారెడ్డితో కలిసి శుక్రవారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముద్దనూరు డివిజన్ పరిధిలో ఉన్నటువంటి విత్తన దుకాణాల్లో లైసెన్స్‌లను, స్టాక్ రిజిష్టర్లను, బిల్లు పుస్తకాలను, స్టాక్ బోర్డులను, గోడౌన్ స్టాక్ పాయింట్‌లను పరిశీలించి దుకాణదారుల యజమానులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు అమ్మాలని, నగదు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మారెడ్డి.వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ మండలంలోని విత్తన లైసెన్స్‌లు కలిగినటువంటి దుకాణాలను పరిశీలిస్తూ అన్ని రిజిష్టర్లను సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అలాగే వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన వాటిని మాత్రమే రైతులకు అమ్మాలని అమ్మిన ప్రతి వాటికి ప్రతి రైతుకు నగదు బిల్లు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. కాల పరిమితి ముగిసిన విత్తనాలను, రైతులకు విక్రయిస్తే విత్తన నియంత్రణ చట్టం 1996 ప్రకారం తగు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే విత్తన నియమ నిబంధనలు 1968ప్రకారం అనుసరించి విత్తన వ్యాపారాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా దుకాణీల డీలర్లు పాల్గొన్నారు.



# రక్తదానం ప్రాణదానంతో సమానం

**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 21, ప్రభాతవార్త:**
స్థానిక రాంబాబు హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న తులసమ్మ అనే మహిళకి బి.నెగెటివ్ రక్తం అవసరం కాగా వారు మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ ఫౌండర్ మోరె లక్ష్మన్ రావుని సంప్రదించగా వారు వెంటనే స్పందించి మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ సభ్యుడు అశోక్‌కుమార్ రెడ్డి చేత సురక్ష బ్లడ్ బ్యాంక్ నందు బి.నెగెటివ్ రక్తదానం చేయించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఫౌండర్ మోరె లక్ష్మన్‌రావు మాట్లాడుతూ మానవత్వంతో ముందుకు వచ్చి రక్తదానం చేసి మానవత్వమును చాటుకున్నప్పుడే ఆ మనిషి యొక్క జీవితానికి అర్థం, పరమార్థం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ మోరె లక్ష్మన్‌రావు, ఫౌండేషన్ టౌన్ వైస్ ప్రెసిడెంట్ మునీంద్ర పాల్గొన్నారు. రక్తదాత అయినటువంటి అశోక్‌కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎవరైనా దాతలు ఉంటే 82972 53484, 91822 44150 అనే నంబర్లకు సంప్రదించవలసిందిగా వారు కోరారు.



## ఆదిత్య కళాశాలలో ఘనంగా యోగా డే



**మదనపల్లె, జూన్ 21 ప్రభాతవార్త :**

పట్టణ సమీపంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా ఆర్ట్ఆఫ్ లివింగ్ యోగా ట్రైనర్ రాజేంద్రప్రసాద్ హాజరై వివిద ఆశనాలు, ప్రాణామయాలు, జానపదటులను వివరించారు. యోగా సాధనను నిత్యం సాగించాలని సంకల్పం తీసుకొన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ యోగా సాధన చేయడం వల్ల పలు ప్రయోజనాలు, శారీరక ఆరోగ్యం, మానసిక శాంతి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సతీష్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అరుణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ అమరనాథ్‌రెడ్డి, విభాగాదిపతులు, విద్యార్థలు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



**మదనపల్లె, జూన్ 21 ప్రభాతవార్త :**

యోగాచేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలో అంతర్జాతీయయోగా దినోత్సవ వేడుకలు పలు ప్రాంతాల్లో జరిగాయి. జిల్లా పరిషత్ హై స్కూల్, మండల పరిషత్‌స్కూల్స్, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో, పట్టణ సమీపంలోని వెలుగు ప్రేత్యక పాఠశాలల్లో, విజయభారతి ప్రైవేటు పాఠశాలల్లో కూడా యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యోగా శిక్షకులు విద్యార్థులచే యోగా విన్యాసాలు చేయించారు. ప్రతిరోజూ యోగా చేయడం వలన విద్యార్థులు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృడత్వాన్ని కలిగి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను కలిసిన మైఫోర్స్‌మహేష్

**మదనపల్లెక్రైం, జూన్ 21 ప్రభాతవార్త :**



ఏపి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణను డిప్యూటిసిఎం క్యాంపు కార్యాలయంలో జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైపోర్స్ మహేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్ మదనపల్లెను జిల్లా ఏర్పాటుకు మాట ఇచ్చిన సంగతి గుర్తు చేసి జిల్లాసాకారం చేయాలని, కడప-బెంగుళూరు రైల్వేలైన్ వయా మదనపల్లె మీదుగా ఏర్పాటుకు కృషి చేయాలని విన్నవించినట్లు తెలిపారు. అంతేకాకుండా హార్సీలీహిల్స్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. దీనికి పవన్‌కళ్యాణ్ స్పందిస్తూ త్వరలోనే అన్ని సమీక్షించి పరిశీలిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరినట్లు తెలిపారు.

## యోగా విద్యార్థులలో ఏకాగ్రత,ఆత్మవిశ్వాసం పెంపొందిస్తుంది



**మైదుకూరు జూన్ 21, ప్రభాతవార్త :**

యోగా విద్యార్థులలో ఏకాగ్రత,ఆత్మవిశ్వాసం పెంపొందిస్తుందని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.నారాయణరెడ్డి తెలిపారు. పదవ యోగా అంతర్జాతీయ దినోత్సవంను జాతీయ సేవా పథకం ఎన్ఏస్ఎస్ ఆద్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ భారత జాతీయ వారసత్వ సంపద అయిన యోగాను ఇతర ప్రపంచ దేశాలు అనుసరించడం అభినందనీయమని ప్రిన్సిపల్ తెలియజేశారు. దేశ ప్రధాని నరేంద్రమోడి యోగాను ప్రపంచ దేశాలు అనుసరించుటకు చేస్తున్న కృషిని అభినందించారు. విద్యార్థి దశనుండి ప్రతిరోజు యోగా సాధన చేయడం ద్వారా ఏకాగ్రత,ఆత్మవిశ్వాసం,సానుకూల దృక్పథం లాంటి అనేక ఉన్నత లక్షణాలు పెంపొందించి జీవితంలో ఉన్నతంగా రాణించడానికి ఉపయోగపడుతుందని తెలియజేశారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్,అధ్యాపకులు మరియు విద్యార్థుల చేత కొన్ని యోగాసనాలను చేయించి వాటి విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.వి కృష్ణారెడ్డి, అధ్యాపక సిబ్బంది పమేశ్వర్‌రెడ్డి, అనురాధ, నరసింహారావు, నవనీశ్వర్‌రెడ్డి, అయ్యవారు రెడ్డి తదితర అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## మీ సేవా కేంద్రాలను తనిఖీ చేసిన డీఎల్‌డీప

**కలికిరి, జూన్ 21, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలో ఉన్న మీ సేవా కేంద్రాలను శుక్రవారం మదనపల్లె డీఎల్‌డీప లక్ష్మీపతి, కలికిరి ఎంపీడీవో రామకృష్ణయ్య, ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సర్టిఫికెట్లలో ఇకపై నో పాలిటిక్స్ మార్క్ ఉండాలని మీ సేవా కేంద్రాలలో సర్టిఫికెట్ల జారీపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. వాటిలో ఎలాంటి రంగులు, ఫొటోలు, రాజకీయ పార్టీకి చెందినవి ఉండకూడదని తెలిపింది. ఈ విషయంపై డీఎల్‌డీఓ లక్ష్మీపతి, ఎంపీడీవో రామకృష్ణ తనిఖీ చేసి సర్టిఫికెట్ల మంజూరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు ఖచ్చితంగా మీ సేవా కేంద్రాల నిర్వాహకులు పాటించాలన్నారు.

## ఘనంగా యోగా దినోత్సవం

**కలికిరి, జూన్ 21, ప్రభాతవార్త:**



కలికిరి జేఎన్‌టీయూ కళాశాలలో శుక్రవారం యోగా అంతర్జాతీయ దినోత్సవం ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ త్యాగరాజన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ఆయుర్వేదిక్ యోగా ఇన్‌ఛార్జి రమేష్ యోగా, మెడిటేషన్ గురించి విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.రాజేంద్రప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నల్లారి అనే నేను.. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన కిశోర్‌కుమార్‌రెడ్డి

**కలికిరి, జూన్ 21, ప్రభాతవార్త:**



అందరూ ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన సమయం ఆసన్నమైంది. నాయకులు, కార్యకర్తలు, సన్నిహితులకు ఎంతో అండగా ఉంటూ తనదైన శైలిలో హుందాగా రాజకీయాల్లో ఉంటున్నారు. రెండు పర్యాయాలు శాసనసభలో అడుగు పెట్టాలనుకున్నా వీలు కాలేదు. అయినా నిరుత్సాహపడకుండా ముందుకు పోయి అందరి ఆకాంక్షలను నెరవేర్చాడు. ఆ నాయకుడే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి. పీలేరు నుంచి తెదేపా ఎమ్మెల్యేగా ఎన్నికైన కిశోర్‌కుమార్‌రెడ్డి శుక్రవారం శాసనసభలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో నియోజకవర్గం జిల్లా వ్యాప్తంగా టీడీపీ, బీజేపీ, జనసేన వర్గాల నాయకులు ఎంతో ఆనందపడ్డారు. పీలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో టీడీపీ నాయకులు ఈ దృశ్యాన్ని టీవీలలో వీక్షిస్తూ సంతోషపడ్డారు. కలికిరి మండలంలో రాజంపేట పార్లమెంటు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు వాసనూరి చంద్రశేఖర్, కలికిరి మండలం టీడీపీ అధ్యక్షులు నిజాముద్దీన్, టీడీపీ సీనియర్ నాయకులు వాటర్‌షెడ్ రవి, జనార్ధన్‌గౌడ్, కలికిరి మండలం మాజీ జడ్పీటీసీ మాలతి, ఎం.ఆనందరెడ్డి, కె.సహదేవరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ఎర్రంరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు కె.అగస్వీశ్వర్, మర్రికుంటపల్లె సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, మునోళ్లపల్లె పంచాయతీ సర్పంచ్ శశికళ, గుండ్లూరు సర్పంచ్ సైఫుల్లా, మర్రికుంటపల్లె ఎంపీటీసీ చిరంజీవమ్మ, సీనియర్ నాయకులు చిన్నరెడ్డయ్య, కొట్టాల టీడీపీ నాయకులు సలయ్య, యువ నాయకుడు నిఖిల్ కుమార్, కలికిరి మండలం టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు చెన్నబసవయ్య, మహేష్, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

## ఘనంగా యోదా దినోత్సవం

**రైల్వేకోడూరు, జూన్ 21, ప్రభాతవార్త:**



రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట డాక్టర్ వైయస్సార్ హార్టికల్చరల్ కళాశాల నందు కళాశాల అసేసియేట్ డీన్ డాక్టర్ గోపాల్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న నిర్వహిస్తున్నామని అదేవిధంగా విశిష్టతను కళాశాల విద్యార్థులకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉద్యాన కళాశాల విద్యార్థులకు నన్నూరి వెంకట శివ యోగ పై అవగాహన కల్పించి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ వెంకట శివను సన్మానించారు. లీలావతి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వై దీప్తి కిరణ్ నిచ్చల రవిశంకర్ బాబు ఫిజికల్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమించి సీబీఎస్ఈ అడ్మిషన్లు చేసుకున్న ప్రయివేటు పాఠశాల సీబీఎస్ఈ ఎన్ఓసీ రద్దుచేయాలి

**పీలేరు, జూన్ 21 ప్రభాతవార్తః**



సీబీఎస్ఈ పేరుతో విద్యాశాఖ నిబంధనలను అతిక్రమించి సీబీఎస్ఈ అడ్మిషన్లు చేసుకున్న పీలేరులోని ప్రయివేటు పాఠశాలకు ఇచ్చిన సీబీఎస్ఈ ఎన్ఓసీని రద్దుచేయాలని అదేవిధంగా నిబంధనలని అతిక్రమించిన పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమతతేజ, జనసేన విద్యార్థి విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు బాటసారి ఆధ్వర్యంలో నేడు తిరుపతి జిల్లా ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలకు కేవలం 7వ తరగతి వరకు మాత్రమే విద్యాశాఖ అనుమతులు ఉన్నాయి. కానీ పాఠశాల వారు మరో పాఠశాల గుర్తింపుతో పదవ తరగతి వరకు అడ్మిషన్లు చేస్తూ తల్లిదండ్రులకు విద్యార్థులకు హైస్కూల్ అడ్మిషన్లు చేస్తున్నట్లు మోసం చేస్తున్నారన్నారు. కావున నిబంధనలకు అతిక్రమించిన యూపీ స్కూల్ యొక్క గుర్తింపును రద్దుచేయాలని డిమాండు చేశారు. అనేక పాఠశాలలో విద్యాసామగ్రిని అధిక మొత్తానికి అమ్ముతున్నారని అటువంటివాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

## ధూప దీప నైవేద్య నిది పథకం లబ్దిని పెంచినందుకు ధన్యవాదాలు

**పీలేరు, జూన్ 21 ప్రభాతవార్తః**



ధూపదీప నైవేద్య పథకం నుంచి 50వేల రూపాయల కంటే తక్కువ ఆదాయం కలిగిన ఆలయాల నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఆలయ అర్చకులకు ఇస్తున్న రూ.5వేలు నుంచి రూ.10వేలుకు పెంచుతూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినందుకు మాజీ బ్రాహ్మణ కార్పోరేషన్ మండల కన్వీనర్ తెలిపారు. తెదేపా 2024 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అదికారం చేపట్టిన రెండు వారాల లోపే రూ.50వేలు ఆదాయం ఉన్న దేవాలయాల్లో దూపదీప నైవేద్యాల కొరకు అర్చకులకు ఇస్తున్న నిధులను రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచుతూ తొలి సంతకం చేసిన రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఎన్నో విభిన్నమైనటువంటి పథకాలను ప్రవేశపెట్టి లక్షలాదిమంది బ్రాహ్మణ కుటుంబాల్లో వెలుగులు నింపినటువంటి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ ఇప్పుడు ఎటువంటి నిధులు లేక గత ప్రభుత్వ పెద్దల చేత మోసగించిబడి ఎటువంటి పథకాలు అమలు జరగక నిర్వీర్యమైపోయినటువంటి బ్రాహ్మణ సంక్షేమ సంస్థకి సకాలంలో నిధులు కేటాయించి తద్వారా నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలలో వెలుగులు నింపడానికి ప్రయత్నం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని బ్రాహ్మణ సంక్షేమ సంస్థ పీలేరు మండల మాజీ కన్వీనర్ సంతోష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

## యోగాతో మానసిక రుగ్మతలు దూరం

**గాలివీడు, జూన్ 21(ప్రభాతవార్త):**



యోగా సాధనతో శారీరక, మానసిక రుగ్మతలు మటుమాయమవుతాయని ఎంఈఓ పిల్లి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యోగా వలన మానసిక ఉల్లాసం, ఉత్సాహం, శారీరక దృఢత్వం కలుగుతాయన్నారు. విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. అంతేకాక యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారన్నారు. కోవిడ్ సమయంలో యోగా సాదన చేసిన వారు ఆరోగ్యవంతమైన జీవనం గడిపారని గుర్తుకు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహిద్దీన్, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుడు గంగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్పంచి ఫిర్యాదుపై స్పందించిన అధికారులు

**విచారణ చేపట్టిన డీఎల్‌పీఓ నాగరాజ**

**పీలేరు, జూన్ 21ప్రభాతవార్తః**



పీలేరు గ్రామ పంచాయతీలో అవకతవకలు జరిగాయంటూ సర్పంచి డాక్టర్ షేక్ హబీబ్‌బాష, జిల్లా కలెక్టర్, డీపీఓలకు చేసిన ఫిర్యాదుపై జిల్లా అధికారులు స్పందించి డీఎల్‌పీఓ నాగరాజును విచారణకు ఆదేశించారు. శుక్రవారం డీఎల్‌పీఓ పంచాయతీ కార్యాలంకు వచ్చి గత 10 నెలలుగా 15 ఫైనాన్సు కమిషన్ నిధులు పంచాయతీ నిధులు వినియోగంపై విచారణ చేపట్టారు. పీలేరు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి ఈఓపై సర్పంచి చేసిన ఆరోపణలుపై కూడా డీఎల్‌పీఓ విచారణ చేపట్టారు. ఈసందర్భంగా తెలిసిన మీడియాతో డీఎల్‌పీఓ మాట్లాడుతూ జిల్లా పరిపాలనాధాకిరి జిల్లా పంచాయతీల అధికారి ఆదేశాల మేరకు తాను ఈవిచారణలో చేపట్టాలని విచారణ పూర్తయ్యాక ఆనివేదికను తన ఉన్నతాధికారులకు సమర్పించడం జరుగుతుందని దానిపై తుది నిర్ణయం జిల్లా ఉన్నతాధికారులకు మాత్రమే ఉంటుందని చెప్పారు.

## సచివాలయానికి ముఖ్యమంత్రి ఫోటోలు అందజేత



**రామసముద్రం, జూన్ 21 ప్రభాతవార్త :**

రామసముద్ర మండలంలోని ఆర్.నడింపల్లె పంచాయితీ సచివాలయానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపనమ ఉఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చిత్ర పటాలను టిడిపి మండల పార్టీ అధ్యక్షులు విజయకుమార్‌గౌడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు అభివృద్దికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయగౌడు, రఘునాథ్‌రెడ్డి, రమేష్, మణి, ఎల్ శివ. అన్సర్‌బాషా, బొంపల్లి చిన్నస్వామి, శీన, చంద్ర సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్నిదానాలలో కన్నా అన్నదానం మిన్న



**పులివెందుల, జూన్ 21, ప్రభాతవార్త ః**

అన్నిదానాలలో కన్నా అన్నదానం మిన్న అని కర్ణపాపాయపల్లెకు చెందిన వెన్నపూస జయరామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం జయరామకృష్ణారెడ్డి కుమారుడు సుజిత్‌రెడ్డి 13వ పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుమారుడి పుట్టినరోజు వేడుకలను అంధుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఉమాదేవి, సాయిరమ, తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాల్లో టిడిపిచే ఫోటోలు ఆవిష్కరణ



**మదనపల్లె, జూన్ 21 ప్రభాతవార్త :**

మున్సిపాలిటి పరిధిలోని పలు సచివాలయాల్లో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాల ఫోటోలను ఆవిష్కరించారు. శుక్రవారం ఎమ్మెల్యే సోదరుడు షంషీర్ ఆధ్వర్యంలో 6,7వార్డుల్లో టిడిపి నాయకులు ఫోటోలు తీసుకువచ్చి సచివాలయాల్లో ఏర్పాటు చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ఫోటోలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ పకడ్బంధీగా నిర్వహించాలి



**వేంపల్లె, జూన్ 21, ప్రభాతవార్త ః**

నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ పకడ్బంధీగా నిర్వహించాలని రాష్ట్ర కాంగ్రెస్ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వేంపల్లెలో అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్, ఆప్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లుగా ప్రధాని మోడీ పాలనలో దాదాపు 72సార్లు పరీక్ష పేపర్లు లీకయ్యాయని అన్నారు. మే 5వ తేదీన దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశానికి నీట్ పరీక్ష జరగగా 24లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. కానీ దురదృష్టవశాత్తు ముందురోజు బీహార్, గుజరాత్, హర్యానా రాష్ట్రాల్లో అనేక చోట్ల పరీక్ష పేరు లీకైందన్నారు. డబ్బులు భారీగా చేతులు మారాయన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడవద్దని తులసిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఘనంగా యోగా డే



**మైదుకూరు రూరల్,జూన్ 21,ప్రభాతవార్త:**

కడప జిల్లా మైదుకూరు మండలంలోని ఒనిపెంట హై స్కూల్ నందు శుక్రవారం జూన్ 21 అంతర్జాతీయ యోగా డే సందర్భంగా విద్యార్థుల్లో ప్రధాన ఉపాధ్యాయులు అవగాహన కల్పించడమే కాకుండా విద్యార్థుల చేత యోగాసనాలు చేయించి వాటి వలన మనకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని మనమే కాకుండా మన దేశ ప్రధాన నరేంద్ర మోడీతో సహా ఎన్నో దేశాలు ఈ రోజున యోగాసనాలు పై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ గురువయ్య,రామనాయక్ పి.డి,మాట్లాడుతూ యోగ వల్ల మనసును, శరీరాన్ని,ఆత్మను ఏకం చేసేది యోగ అని ఇది వ్యామాయం కాదని తెలుపుతూ మయూరాసనం, త్రికోణాసనం,మకరాసనం,పశ్చిమోత్తాసనం,అర్థ చంద్రాసనం, భుజంగాసనం, శలభాసనం, ప్రాణాయామం..ఇలా ఎన్నో రకాల జబ్బులకు వైద్యుని వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉండదని,ప్రతిరోజు వీలు దొరికినప్పుడల్లా యెగా చేయాలనీ,అయితే పరగడుపున చేస్తే మిక్కిలి ప్రయోజనం ఉంటుందని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



# యోగాతో మానసిక ఆరోగ్యం

బద్వేలు అర్బన్ , జూన్ 21 ప్రభాతవార్త :

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బద్వేలులోని రత్నం ఇంగ్లీషు మీడియం పాఠశాలలో పలువురు విద్యార్థులకు యోగా గురించి పాఠశాల కరస్పాండెంట్ తలారీ రత్నం ఆధ్వర్యంలో శ్రీ కన్యకాపరమేశ్వరి బాలుర ఉన్నత పాఠశాల స్కౌట్ మాస్టర్ శివ ప్రసాద్ పలువురు విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు, విద్యతోపాటు క్రీడలు యోగాలాంటి వాటిలో కూడా తెలుసుకుని అన్ని రంగాలలో ముందుకు రావాలన్నారు. యోగ శరీరానికి దివ్యౌషధం అని, శరీరాన్ని, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో యోగా ప్రధాన పాత్ర పోషిస్తుందని, ప్రతి రోజూ యోగాసనాలు వేసి సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని తెలియజేస్తూ యోగా వల్ల ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందించుకోవచ్చన్నారు. త్రికోణాసనం, భుజంగాసనం, ప్రాణాయామం, ధ్యానంకు సంబంధించిన యోగాసనాల గురించి వివరించారు. యోగా సంపూర్ణ ఆరోగ్యానికి వారధి అని తెలియజేశారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ తలారి రత్నం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రతి రోజూ క్రమం తప్పకుండా యోగ చేయడం వలన మానసిక ప్రశాంతతతో ఎంతగానో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది దిలీప్, వెంకటయ్య, పాఠశాల డైరెక్టర్ తలారీ శ్రీనాథ్ ఉపాధ్యాయునిలు రాజేశ్వరి, కల్పన, హరికుమార్‌తో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేగా షాజహాన్‌బాషా ప్రమాణస్వీకారం

మదనపల్లె, జూన్ 21 ప్రభాతవార్త :



మదనపల్లె నియోజకవర్గ శాసనసభ్యులుగా శుక్రవారం అసెంబ్లీలో షాజహాన్‌బాషా ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత ఆయన కాంగ్రెస్ పార్టీలో 2009లో జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రంలోని మదనపల్లె ఎమ్మెల్యేగా మొదటి సారి ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. అనంతరం 2024 ఎన్నికల్లో కూటమి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిపొంది రెండవ సారి ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన ప్రమాణ స్వీకారం చేయడం పట్ల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు బాణసంచాపేల్చి స్వీట్లు పంచిపెట్టి సంబరాలు చేశారు. మదనపల్లెతో పాటు నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో కూడా టిడిపి నాయకులు సంబరాలు జరిపారు.

## భాష్యం స్కూల్‌లో యోగా దినోత్సవం



మదనపల్లెక్రైం, జూన్ 21 ప్రభాతవార్త :

యోగాచేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని భాస్యంస్కూల్ ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు స్కూల్‌లో ఘనంగా జరిగాయి. భాష్యం స్కూల్‌తో పాటు, శ్రీచైతన్య టెక్నోస్కూల్, ఇతర ప్రైవేటు పాఠశాలల్లో కూడా యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యోగా శిక్షకులు విద్యార్థులచే యోగా విన్యాసాలు చేయించారు. ప్రతి రోజూ యోగా చేయడం వలన విద్యార్థులు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృడత్వాన్ని కలిగి ఉంటారన్నారు. ఈ సందర్భంగా భాష్యం స్కూల్ విద్యార్థులకు ధాత్రి పౌండేషన్‌చే బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ డాక్టర్ స్వాతి, దాత్రి సభ్యులు, చక్రపాణి, మురళి, గీతలు పాల్గొన్నారు.

## నూతన పరిపాలనకు శ్రీకారం చుట్టనున్న జనసైనికుడు

రైల్వేకోడూరు,జూన్ 21,ప్రభాతవార్త:



రైల్వేకోడూరు నియోజకవర్గంలో గత 20 సంవత్సరాలుగా వైసిపికి చెందిన ఎమ్మెల్యే పరిపాలన నేటితో అంతమైపోయిందని నేటి నుండి రైల్వేకోడూరు నియోజకవర్గానికి టిడిపి ఇంచార్జ్ ముక్కా రూపానందరెడ్డి ప్రియ శిష్యుడు జనసేన అసెంబ్లీ అభ్యర్థి అరవ శ్రీధర్ పరిపాలన శుక్రవారం నుండి ప్రారంభం కానున్నది,ఇందులో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నియోజకవర్గం నూతన పరిపాలన విధానానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిసింది.ఇటీవల రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎన్నో సంవత్సరాలుగా దళిత నియోజకవర్గం అయినందున ఇటీవల వైసీపీ పార్టీకి చెందిన అభ్యర్థి ఓడిపోవడం అదే కోవలో జనసేన అభ్యర్థి గెలుపు రావడం ముక్కా రూఆపానంద రెడ్డికి టిడిపి పగ్గాలు రావడం అలుపు ఎరగని యోదుడిగా రూపానందరెడ్డి ఆయన కుటుంబ సభ్యులు ఏక మనస్తత్వంతో అభ్యర్థి గెలవాలని జండా ఎగరేయాల అని నినాదంతో రైల్వేకోడూరు నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో అభ్యర్థిని గెలిపించుకుని తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని అంటు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఇటు జనసైనికుడు పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా అభ్యర్థిని గెలిపించుకోవడం రూపానందరెడ్డికి అధిష్టానం వద్ద తిరుగులేని విజయ బోవుట దొరికిందని రైల్వేకోడేరు నియో.కవర్గంలో ప్రముఖ రాజకీయ విశ్లేషకుల భావన.ముఖ్యంగా రైల్వేకోడూరు నియమోజవర్గంలో దిష్ట వేసిన అభివృద్ధిని రూపానందరెడ్డి తోనే ప్రారంభం అవుతుందని ఐదు మండలాలలోని రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తులు చర్చింకుంటున్నారు. అనాడు టిడిపి రథసారధి కట్టా నారాయణయ్య స్థానం నుండి మరో మారు రూపానందరెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని టిడిపి కంచుకోటగా తయారు చేసేందుకు కింగ్ మేకర్ ముక్కా రూపానందరెడ్డి ముందడుగులు వేయనున్నారని తెలిసింది.తన ప్రియ శిష్యుడు ఆరవ శ్రీధర్ ముక్కావారిపల్లె సర్పంచ్ స్థాయి నుండి రాష్ట్ర శాసనసభకు ఎంపిక కావడం విశేషమని రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజలు అభివృద్ధిపై చర్చించుకుంటున్నారు.

## పదో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

కమలాపురం, జూన్ 21, ప్రభాతవార్త:

అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ మరియు పీజీ కళాశాలలో యోగా కార్యక్రమం నిర్వమించడం జరిగింది. ప్రిన్సిపల్ డా.జి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ స్వీయ మరియు సమాజం కోసం యోగా అని ప్రకటించారని ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని తద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అశోక్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని యోగాజనాలు వేయడం జరిగింది.



## యోగా తోనే సంపూర్ణ ఆరోగ్యం

బద్వేలు అర్బన్ , జూన్ 21 ప్రభాతవార్త :

చిన్న వయసు నుంచే విద్యార్థులు చదువుతోపాటు యోగ, క్రీడలలో అన్ని రంగాలలో ముందుకు రాణించాలని రాయలసీమ ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొడిసిపాటి అంకయ్య, తెలుగు పండిట్ అంబవరం వేణుగోపాల్‌రెడ్డి అన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలోని రాయలసీమ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో పలువురు విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించి పలు రకాల ఆసనాలు చేయించడం జరిగింది. అనంతరం పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొడిసిపాటి అంకయ్య, తెలుగు పండిట్ అంబవరం వేణుగోపాల్‌రెడ్డి లు మాట్లాడుతూ యోగ భారత దేశంలో పుట్టి ప్రపంచ దేశాలలో ప్రాచుర్యం పొందిందని, యోగ వలన ప్రతిరోజూ ఆరోగ్యంతో పాటు అందమైన శరీరాన్ని పొందవచ్చని దీనిని మొదట్లో చేయడం కష్టంగా ఉంటుందని, రోజూ చేయడం ద్వారా అలవాటవుతుందని, ఎన్నో ఆరోగ్య సమస్యలు యోగాతోనే పరిష్కారమవుతాయన్నారు. ఆసనాలు చేయడం వలన రక్త ప్రసరణ అందుబాటులో ఉండడమే కాకుండా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, కావున ప్రతి ఒక్కరూ యోగాను చేసి మంచి ఆరోగ్యం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలరాజు, శివమ్మ, సుభాషిని, లక్ష్మి, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



పులివెందుల టౌన్, జూన్ 21, ప్రభాతవార్త ః

యోగా చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని గురువు వెంకటరామిరెడ్డి అన్నారు. పులివెందులలోని సరస్వతి విద్యామందిరంలో శుక్రవారం వాసవిక్లబ్, వనితక్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. యోగాగురువు మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం వలన మానసిక ప్రశాంతత లభిస్తుందని, తద్వారా ఆరోగ్యం మెరుగు పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వాసవిక్లబ్ అధ్యక్షుడు సగళా మహేంద్రబాబు, వాసవిక్లబ్ స్ట్రాటెడ్ ప్రెసిడెంట్ మాలెపాటి విజయ్‌కుమార్, వనితక్లబ్ అధ్యక్షురాలు పబ్బతి మాధవీలత, తదితరులు యోగా గురువును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త రవికుమార్ శ్రేష్ఠి, సభ్యులు పాల్గొన్నారు.

**– పులివెందుల ః** పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాల ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు స్నేహిత అమృతహస్తం సేవా సమితి, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆద్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యోగాగురువు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మనిషి జీవితంలో యోగా నిరంతర ప్రక్రియగా అలవరచుకోవాలన్నారు. ఆరోగ్య భారతావని కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గణేష్, ప్రోగ్రాం అధికారిణి నాగేంద్రమ్మ, యోగాశిష్యులు నాగరాజు, నీలావతి, ప్రభావతి, సేవాసమితి అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు పాలనలో స్వర్ణాంధ్రప్రదేశ్ ఖాయం

తంబళ్లపల్లె, జూన్ 21, ప్రభాతవార్త:



సీఎం చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సమస్యలు తీరి స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన ఖాయమని తెదేపా నాయకుడు మలిగి మధుసూదన్‌రెడ్డి ధీమాగా చెప్పారు. శుక్రవారం ఆయన సొంత మండలం తంబళ్లపల్లెలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆదర్శ భాస్కర్‌రెడ్డి గృహంలో మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలి వచ్చి మదుసూదన్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీకి కంచుకోట ఇలాంటి చోట పార్టీ ఓడిపోవడం బాధాకరమని ఆయన రాబోయే రోజుల్లో తెదేపా జెండా రెపరెపలాడించడం ఖాయమన్నారు. వవారపు సంతలో వెలసిన కోటకొండ గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించడానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వందలాదిగా తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

## అన్నమాచార్య ఫార్మసి విధ్యార్థుల ప్రతిభ

రాజంపేట అర్బన్, జూన్ 21, ప్రభాతవార్త:

రాష్ట్రస్థాయి ఉన్నత విద్య ప్రవేశపరీక్ష పిజిఈసిఈటిలో అన్నమాచార్య ఫార్మసి కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో బి.ఫార్మసీ విద్యను అభ్యసించి ఆ తర్వాత పై చదువుల యొక్క అర్హత పరీక్ష అయిన పీజీఈసెట్ రాష్ట్రస్థాయి ప్రవేశ నిర్వహణ పరీక్షలో 25మంది విధ్యార్థులు అర్హత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డి.స్వర్ణలత, హెచ్‌ఓడి డాక్టర్ పి.ద్వారకనాథ్ రెడ్డి తెలిపారు. ఈ అర్హతను సాధించిన విద్యార్థులందరిని అందుకు తోడ్పడిన అధ్యాపక బృందాన్ని కళాశాల యాజమాన్యం కార్యదర్శి సి.గంగిరెడ్డి, కోశాధికారి సి.అభిషేక్‌రెడ్డి, వైస్‌చైర్మెన్ సి.ఎల్లారెడ్డి, చైర్మెన్ సి.రామచంద్రారెడ్డి అభినందించారు. ఈ ప్రవేశ పరీక్షలో ఏ.తరుణ్, సి.రమ్యశ్రీ, మౌనిక, కే.మహిమకుమారి, ఆర్.వెంకటస్వాతి, వై.పద్మశ్రీ, బి.హేమలత, వి.సుదీప, ప్రియాంక, నజీర్ ఆహ్మద్, జి.హేమలత, కే.శిరీష, కే.ప్రసన్న, బి.సంధ్య, కే.కిరీటి, కే.మధుమిత, వి.సాహితీ, కే.ప్రియాన్సు, టి.లావణ్య, యు.రవితేజ మొదలగు విధ్యార్థులు అర్హత సాధించారు.

## నారాయణ స్కూలుకు నోటీసులు జారీ

కమలాపురం, జూన్ 21, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కొండాయపల్లి గ్రామం వద్ద నూతనంగా ప్రారంభించిన నారాయణ స్కూలుకు నోటీసులు జారీ చేశామని ఎంఈవో-2 సుభాషిని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని పెద్దచెప్పలి, కొండాయపల్లి గ్రామంలో ఆ పాఠశాల ప్రారంభానికి అనుమతులు 27.9.23న మంజూరు చేయడం జరిగింది. అనుమతులు మంజూరైన తరువాత ఆరు నెలల లోపు స్థానిక విద్యాశాఖ కార్యాలయానికి గుర్తింపునకు ప్రతిపాదనలు మంజూరైన ప్రతిపాదనలు పంపాల్సి ఉంది. కానీ పాఠశాల యాజమాన్యం 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇంత వరకు ఎలాంటి పత్రాలు సమర్పించలేదని ఈ మేరకు మండల విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు.

### అధికారులు ఏకపక్షం వీడి..

## అభివృద్ధి దిశగా అడుగులు వేయాలి



ఖాజీపేట, జూన్ 21, ప్రభాతవార్త:

అధికారులు గత ప్రభుత్వంలో ఏకపక్షంగా వ్యవహరించారని అలా కాకుండా అందరికి న్యాయం జరిగేలా, అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం పుల్లూరు పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులుతో పంచాయతీలో నెలకొన్న సమస్యల గురించి వారు చర్చించారు. ఆర్‌అండ్‌బి కి సంబంధించి షాపుల నెలవారి బాడుగల గురించి ఆరాతీశారు. త్రాగునీటి మినరల్ ప్లాంట్ విద్యుత్ బకాయిలు లక్షల రూపాయల్లో ఉందని తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ముళపాక పంపు స్కీం నుండి వచ్చే నీటిని ఓవర్ హెడ్ ట్యాంక్‌కు అమర్చి నీటిని అందించేవారని, పైప్‌లైన్ పైన వైసీపీ నాయకులు స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు కట్టుకున్న కారణంగా నీటి సరఫరా జరగలేదన్నారు. అక్రమణలను తొలగించి యదావిధిగా నీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. హరిజనవాడలోని సమస్యల గురించి గత కొన్ని రోజులుగా స్పందించకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి చిత్ర పటాలను సచివాలయం నుండి తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల సుబ్బయ్య, గోవిందు, సుబ్బయ్య, ఇరగంరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కమళాపురం గౌస్, ఫరూక్ ఆహ్మద్, పల్లె గంగాధర్, షమీ, సుల్తాన్, నూరుల్లా, జెండాల మాబాష తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన అర్జునుని తపస్సు

పీలేరు, జూన్ 21 ప్రభాతవార్తః



పట్టణంలోని ఆర్టీసీ ప్రాంగణంలో గత పది రోజులుగా జరుగుతున్న పంచమవేద మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం అర్జుని తపస్సు ఘనంగా నిర్వహించారు. తపస్సు మాను వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం అర్జునుడి వేషదారి శివనామస్మరణతో భక్తిపాటలు ఆలపిస్తూ ఒక్కో మెట్టు పైకి ఎక్కాడు, అక్కడ తపస్సు చేసి పుష్పాలు, మిఠాయిలు భక్తులపై విసిరారు. దానికోసం పెద్ద ఎత్తున భక్తులు ఎగబడ్డారు. కార్యక్రమంలో భాగంగా మహిళలు తమ మొక్కులు తీర్చాలని అర్జున తపస్మాన్ వద్ద వరపడ్డారు. మహాభారత యజ్ఞం కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అర్జుని తపస్మాన్‌ను తిలకించుటకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యోగాతో శారీరక మానసిక వికాసం సాకారం అవుతుంది.

లక్కిరెడ్డిపల్లె,జూన్ 21,ప్రభాతవార్త:



యోగాతో మానసిక వికాసం సాకారం అవుతుందని ఇన్చార్జ్ ఎంపిడిఓ పట్నాయక్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగానియోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఏపి మోడల్ స్కూల్,శ్రీ వెంకటేశ్వర ఎయిడెడ్ జూనియర్ కళాశాల, విశ్వభారతి హై స్కూల్, కేజిబివి, గురుకుల, ప్రైవేటు పాఠశాలలో యోగా కార్యక్రమం విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల ప్రకృతితో మమేకం పరిపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యమువుతుందన్నారు.యోగావలన మానసిక ఉల్లాసంతో పాటు మంచి జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చున్నారు. ఎంఈఓ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మనిషి వికాస వ్యక్తిత్వాన్ని వికాసాని దోహపడుతుందని యోగ వలన ఎన్నో ప్రయెజనాలు ఉన్నాయన్నారు.విద్యార్థులు ఉదయం 5 గంటలకు నిద్రలేసి యోగా కార్యక్రమాలను అలవాటు చేసుకోవలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపిల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి.యోగా మాస్టర్ సోమశేఖర్ నాయక్,అద్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యోగా అంటే ప్రపంచానికి భారత్ ఇచ్చిన కానుక

– జిల్లా యువ అధికారి మణికంఠ

కడప వైద్యవిభాగం, జూన్ 21, ప్రభాతవార్త:

యోగా దినోత్సవం మన వారసత్వ సంపద గొప్ప దనాన్ని ప్రపంచానికి చాటి చెప్పే మహాసంకల్పమని నెహ్రూ యువ కేంద్రజిల్లా యువ అధికారి మణికంఠ అన్నారు. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మిత్ర యోగా సెంటర్‌లో నెహ్రూ యువ కేంద్ర, ఇంటాక్, లయన్స్ క్లబ్ వారు సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన యోగా వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. యోగా నిపుణులు రంగనాథ్‌రెడ్డి యువతకు యోగా ప్రాముఖ్యత వివరించి ఆసనాలు వాటి అవసరాలు, విలువలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతుల వెంకటరామిరెడ్డి, ఇంటాక్, లయన్స్ క్లబ్ సభ్యులు అశోక్, నవతరం యూత్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీ నారాయణ, నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్లు పాల్గొన్నారు.



## అత్తిరాలలో ఘనంగా పౌర్ణమి గిరి ప్రదర్శణ

రాజంపేట అర్బన్, జూన్ 21, ప్రభాతవార్త:

పౌర్ణమి గిరి ప్రదక్షిణ శివ క్షేత్రం అత్తిరాలకు భక్తులు తరలివచ్చారు. త్రేతేశ్వర స్వామి గిరి ప్రదక్షిణకు కమిటీ ఏర్పాట్లు చేసింది. భక్తులు భారీగా గిరి ప్రదక్షిణ చేయడం జరిగింది. అనంతరం బహుద నదికి పురోహితులు గంగా హారతి ఇచ్చారు. గంగా హారతి కార్యక్రమంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. భక్తులు, దాతలు గిరి ప్రదర్శణ మండలికి విరాళాలు అందించారు.



## సూపర్ కే గోల్డ్ మెంబర్షిప్ ప్రారంభం

కడప వైద్యవిభాగం, జూన్ 21, ప్రభాతవార్త:

ఏపీలో అతి పెద్ద ఫ్రాంచేజీ సూపర్ మార్కెట్ చెయిన్ మార్కెట్ సూపర్ కే శుక్రవారం సూపర్ కే గోల్డ్ మెంబర్షిప్ కడపలో ప్రారంభించడం సంతోషంగా ఉందని వ్యవస్థాపకులు అనిల్, నీరజ్ మెంటా పేర్కొన్నారు. శనివారం సూపర్ కే రాయలసీమ గోడౌన్‌లో కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. సూపర్ గోల్డ్ మెంబర్షిప్ ద్వారా సరుకులపై 10 శాతం క్యాష్ బ్యాక్‌పొందవచ్చన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

